కాలనీల అభివృద్ధికి కృషి చేయాలి



ఎమ్మెల్సీ శంభీపూర్ రాజును సన్మానిస్తున్న కమిటీ సభ్యులు

ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు

దుండిగల్: సంక్షేమ సంఘాలు కాలనీల అభివృద్ధికి కృషి చేయాలని, వారికి తమ పూర్తి సహకారం ఉంటుందని ఎమ్మెల్సీ శంభీపూర్ రాజు అన్నారు. దుండిగల్ మున్సిపాలిటీ డి.పోచంపల్లిలోని సురక్ష గ్రీన్ మెడోస్ కల్చరల్ అసోసియేషన్ నూతన కమిటీ సభ్యులు శనివారం కలిసి సమస్యలను వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అసోసియేషన్ సభ్యులంతా ఐకమత్యంగా ఉంటూ అభివృద్ధికి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నూతన కమిటీ అధ్యక్షుడు వేణుగౌడ్, జనరల్ సెక్రటరీ శ్రీరాములు, ఉపాధ్యక్షుడు సుధాకర్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ హేమంత్ రెడ్డి, సుధాకర్ గౌడ్, సాంబశివ రావు, అమర్‌నాథ్, భాస్కర్ పాల్గొన్నారు.

ముగిసిన వైజ్ఞానిక ప్రదర్శన

దుండిగల్: దుండిగల్ మున్సిపాలిటీ గాగిల్లాపూర్‌లోని ఎస్ఎస్‌కేకే స్కూల్‌లో రెండు రోజుల పాటు నిర్వహించిన రాష్ట్రీయ బాల వైజ్ఞానిక, మేడ్చల్ జిల్లా స్థాయి వైజ్ఞానిక ఎగ్జిబిషన్ శనివారం ముగిసింది. సుమారు 280 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అందులో 24 మంది విద్యార్థులు ప్రతిభ చూపారు. ముగింపు సమావేశంలో డీఈఓ విజయ కుమారి మొదటి, ద్వితీయ, తృతీయ బహుమతులను అందజేశారు. అదే విధంగా 8 మందిని సౌత్ ఇండియన్ సైన్స్ ఫెస్టివల్, 17 మందిని రాష్ట్ర స్థాయికి ఎంపిక చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కె. శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా అకాడమిక్ మానిటరింగ్ అధికారి రవీందర్ రాజు, ఎంఈఓ కృష్ణ, కుత్బుల్లాపూర్ ఎంఎల్ఓ రమేష్, ఎస్ఎస్‌కేకే స్కూల్ సెక్రటరీ బాబు, ప్రిన్సిపాల్ సుమాదేవి, అన్ని మండలాల విద్యాధికారులు పాల్గొన్నారు.



విద్యార్థులకు బహుమతులను అందజేస్తున్న డీఈఓ విజయకుమారి

సమాచారం లేదని బహిష్కరించిన ఉపాధ్యాయ సంఘాలు

సాక్షి,సిటీబ్యూరో: మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాలోని గాగిల్లాపూర్ హైస్కూల్‌లో నిర్వహించిన జిల్లాస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను ఉపాధ్యాయ సంఘాలు బహిష్కరించాయి. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ నెల 22, 23 తేదీల్లో జరిగిన వైజ్ఞానిక ప్రదర్శనలో జిల్లా నుంచి అనేక ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఎగ్జిబిట్స్‌ను ప్రదర్శించారు. ప్రతి సంవత్సరం అన్ని జిల్లాల్లో విద్యాశాఖ ఆధ్వర్యంలో ఈ వైజ్ఞానిక ప్రదర్శనలు జరుగుతుంటాయి. ఇందులో భాగంగా జిల్లాలో విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాలు సమన్వయంతో ఈ ప్రదర్శనను నిర్వహిస్తుంటారు. కానీ మేడ్చల్ జిల్లాలో మాత్రం ఉపాధ్యాయుల తరపున ఎన్నికైన ఎమ్మెల్సీ ఏవీఎన్‌రెడ్డిని జిల్లా అధికార యంత్రాంగం ఆహ్వానించకపోవటంతో పాటు ఉపాధ్యాయ సంఘాలకు కనీస సమాచారం అందించకపోవటాన్ని ఆ సంఘాలు తీవ్రంగా ఖండించాయి. దీనికి నిరసనగా ఉపాధ్యాయ సంఘాలు జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శనను బహిష్కరించినట్లు పేర్కొన్నాయి. ఇక ముందు ఇలాంటి సంఘటనలు జరుకుండా చూడాలని ఉపాధ్యాయ సంఘాల జిల్లా ప్రతినిధులు శ్రీధర్, నవీన్, వెంకటేశ్వర్లు, జయసింహారెడ్డి, మదన్‌రెడ్డి, రాఘవేందర్ కోరారు.

అధికారులు కక్షపూరితంగా వ్యవహరించొద్దు

కుత్బుల్లాపూర్: అక్రమ నిర్మాణాల పేరుతో ఇళ్లను ఏకపక్షంగా సీజ్ చేస్తూ అధికారులు కక్ష పూరితంగా వ్యవహరిస్తున్నారని బీజేపీ జిల్లా కన్వీనర్ మల్లారెడ్డి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎంఎస్ వాసు అన్నారు. గిరినగర్‌లో 50 సంవత్సరాలుగా నివాసం ఉంటున్న వారి ఇళ్లను అక్రమ నిర్మాణాలు అంటూ సీజ్ చేయడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు శేఖర్ ముదిరాజ్ గిరినగర్‌లో ఉంటూ ఇంటి నిర్మాణం చేపడుతుండగా కొంతమంది గిట్టనివాళ్ల ఫిర్యాదుతో సర్కిల్ అధికారులు ఇల్లుని సీజ్ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నో అక్రమ నిర్మాణాలను వదిలి తన ఇంటిని టార్గెట్ చేయడంపై శనివారం సర్కిల్ కార్యాలయం ఎదుట బాధితుడు నాయకులతో కలిసి ఆందోళన చేశారు. అనంతరం ఉప కమిషనర్ నరసింహకు వినతి పత్రం అందజేశారు.

విద్యార్థుల పరీక్ష ఫీజు చెల్లింపు



పరీక్ష ఫీజు చెల్లిస్తున్న కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి

కుత్బుల్లాపూర్: గాజులరామారంలోని జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో పదిహేను మంది తల్లి, తండ్రి లేని పదవ తరగతి విద్యార్థులకు కాంగ్రెస్ నాయకుడు బుచ్చిరెడ్డి అండగా నిలిచారు. పరీక్ష ఫీజు చెల్లించడానికి విద్యార్థులు పడుతున్న ఇబ్బందులను హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ సభ్యులు బుచ్చిరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆయన స్పందించి విద్యార్థుల పరీక్ష ఫీజును పాఠశాల హెచ్ఎం అశోక్ రెడ్డికి శనివారం చెల్లించారు. రాబోయే రోజుల్లో కూడా విద్యార్థులకు అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో హెల్పింగ్ హార్ట్స్ సొసైటీ అధ్యక్షుడు విజయ్ కుమార్, సామాజికవేత్త మధు బాబు, మంజునాథ్ షిండే, సతీష్ యాదవ్, శ్రీధర్, రాధాకృష్ణ పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి

జీడిమెట్ల: ప్రతి వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని బాలానగర్ ఏసీపీ హన్మంతరావు అన్నారు. శనివారం జీడిమెట్ల పీఎస్ పరిధిలో ఇన్‌స్పెక్టర్ గడ్డం మల్లేష్, డీఐ కనకయ్య, ఎస్సైలతో కలిసి స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. డ్రైవ్‌లో భాగంగా సరైన నెంబర్ ప్లేట్‌లేని 40 వాహనాలను స్టేషన్‌కు తరలించారు. అదే విధంగా హెల్మెట్ ధరించకుండా డ్రైవింగ్ చేస్తున్న పలువురిని స్టేషన్‌కు తరలించి నిబంధనలపై అవగాహన కల్పించారు.



వాహనాల తనిఖీలో పాల్గొన్న పోలీసులు

నాలాలో పేరుకుపోయిన చెత్తాచెదారాలు



జీడిమెట్ల: జీడిమెట్ల ఫేజ్ 2 నుంచి ఎస్వీ కో ఆపరేటివ్ సొసైటీ వెళ్లే దారిలో నాలాలో చెత్తాచెదారాలు పేరుకుపోయాయి. భారీగా చెత్త పేరుకుపోవడంతో కుళ్లిపోయి దుర్వాసన వస్తుండటంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. రోడ్డుపై రాకపోకలు సాగించాలంటే దుర్వాసనకు ముక్కు మూసుకుని వెళ్లాల్సి వస్తుందని బాటసారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నాలాలో పేరుకుపోయిన చెత్తను తొలగించాలని కోరుతున్నారు.

బచ్‌పన్ ప్లే స్కూల్‌లో రెడ్ కలర్ డే

కుత్బుల్లాపూర్: చింతల్ వేంకటేశ్వర నగర్‌లోని బచ్‌పన్ ప్లే స్కూల్‌లో శనివారం రెడ్ కలర్ డే ను ఘనంగా నిర్వహించారు. పాఠశాల మొత్తాన్ని రెడ్ కలర్‌తో నిపడంతో పాటు ప్రీ ప్రైమరీ విద్యార్థులు ఎర్రటి దుస్తులు ధరించి రెడ్ కలర్ బెలూన్‌లు, బొమ్మలతో సందడి చేశారు. ఎరుపు రంగు విశిష్టతను విద్యార్థులకు చాటేందుకే రెడ్ కలర్ డేను నిర్వహించామని పాఠశాల చైర్మన్ కోటిరెడ్డి తెలిపారు.



రెడ్ కలర్ డేలో పాల్గొన్న విద్యార్థులు

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చింతల్: విద్యుత్ ఫీడర్ లైన్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు సందర్భంగా ఏడీఈసీబీడీ బోయిన్‌పల్లి పరిధిలోని ఆయా సబ్ స్టేషన్ల ఫీడర్ల పరిధిలో శనివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని ఏడీఈ లక్ష్మీనారాయణ ఓ ప్రకటనలో తెలిపారు. 33/11 కేవీ ప్రాగటూల్స్ సబ్ స్టేషన్ పరిధిలో ఉదయం 10 నుండి సాయంత్రం 5 గంటల వరకు ఆయా ఫీడర్ల పరిధిలలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు తెలిపారు. ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 1గంట వరకు రాజ్ ఫుడ్స్ ఫీడర్ పరిధిలోని రంగారెడ్డినగర్, రాజ్ ఫుడ్స్, టెక్నో ఎలక్ట్రికల్స్, బాలాజీ ఎలక్ట్రికల్స్, అదే విధంగా మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు అరుణాచలం ఫీడర్ పరిధిలోని ఎస్సార్ ఎంటర్‌ప్రైజెస్, జీహెచ్ సోలార్ సిస్టమ్స్, అరుణాచలం, టాటా హిటాచి లైన్‌లలో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

మేయర్‌కు ఆహ్వానం



మేయర్‌కు ఆహ్వాన పత్రికను అందజేస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

నిజాంపేట్: ప్రగతినగర్ రామాంజనేయ స్వామి ఆలయ కమిటీ సభ్యులు శనివారం నిజాంపేట్ మేయర్ కొలన్ నీలారెడ్డికి ఆహ్వాన పత్రికను అందజేశారు. నిజాంపేట్ గౌరి శంకరస్వామి ఆలయంలో ఆదివారం జరిగే మానసాదేవి హోమం, అన్నదానం, లక్ష దీపోత్సవంలో పాల్గొనాలని ఆలయ కమిటీ సభ్యులు ఆహ్వానించారు. కార్యక్రమంలో రాములునాయక్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేంకటేశ్వరుడికి లక్ష తులసీదళ అర్చన



ప్రత్యేక అలంకరణలో స్వామి వారు

జగద్గిరిగుట్ట: కార్తీకమాసం సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గంలోని అన్ని దేవాలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా చింతల్ పద్మానగర్ ఫేజ్ 1లోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం లక్ష తులసీదళ అర్చన నిర్వహించారు. పూజల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి వారిని దర్శించుకున్నారు.

గడప గడపకు పథకాలు చేరాలి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్

కుత్బుల్లాపూర్: రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు గడప గడపకు చేరేలా కార్యకర్తలు విస్తృత కార్యక్రమాలు చేపట్టాలని కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు సింగిరెడ్డి హరివర్ధన్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలంగౌడ్ అన్నారు. రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తవుతున్న సందర్భంగా శనివారం హెచ్ఏఎల్ కాలనీలోని సిటీ ప్యాలెస్‌లో నియోజకవర్గ ఇన్‌చార్జి కొలన్ హన్మంతరెడ్డి అధ్యక్షతన ప్రజా పాలన విజయోత్సవ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఎన్నికల హామీలను సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం దాదాపుగా నెరవేర్చిందన్నారు. ఏడాది కాలంగా రాష్ట్రం అభివృద్ధి దిశగా పయనిస్తోందని, సంక్షేమ ఫలాలు అందుకున్న పేద ప్రజలు సంతోషంగా ఉన్నారన్నారు. అన్ని వర్గాల అభ్యున్నతికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. ప్రజాపాలన సంవత్సరం కావస్తున్న తరుణంలో ప్రతి కాలనీ, బస్తీలల్లో సంబురాలు నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నర్సారెడ్డి భూపతిరెడ్డి, కంటెస్టెడ్ కార్పొరేటర్ కూన శ్రీనివాస్‌గౌడ్, మహిళా విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్ లక్ష్మి, జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బొంగునూరి ప్రభాకర్‌రెడ్డి, ఐఎన్‌టీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు గుంజ శ్రీనివాస్, జిల్లా ఉపాధ్యక్షుడు శ్రావణ్‌కుమార్, ఐలయ్యగౌడ్, బుచ్చిరెడ్డి, మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ లక్ష్మారెడ్డి, మాజీ కార్పొరేటర్ బొడ్డు వెంకటేశ్వరరావు, కార్యకర్తలు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను అందిపుచ్చుకోవాలి



పట్టాలు పొందిన ఆనందంలో విద్యార్థులు

నిజాంపేట్: ప్రపంచంలో ఉన్న అవకాశాలను విద్యార్థులు అందిపుచ్చుకోవాలని, పోటీ ప్రపంచంలో మనకంటూ ఓ ప్రత్యేకత ఉండాలని ఎల్టీఐ మైండ్‌ట్రీ అధ్యక్షుడు సుధీర్ చతుర్వేది అన్నారు. శనివారం బాచుపల్లిలోని విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (వీజేఐఎం)కళాశాలలో 30వ స్నాతకోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరై విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ డైరెక్టర్ ప్రొఫెసర్ భరత్ భూషణ్‌సింగ్‌తో కలిసి విద్యార్థులకు పట్టాలు, సర్టిఫికెట్లను అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. విద్యార్థులు పాజిటివ్ ఆలోచనా విధానాన్ని అలవర్చుకోవాలని సూచించారు. అనంతరం విజ్ఞాన జ్యోతి వైస్ ప్రెసిడెంట్ రాజశేఖర్ మాట్లాడుతూ.. దక్షిణ భారతదేశంలోని అగ్రశ్రేణి ప్రైవేట్ బిజినెస్ స్కూల్‌లో వీజేఐఎం ఒకటిగా ఉందని తెలిపారు. కార్యక్రమంలో విజ్ఞాన జ్యోతి జనరల్ సెక్రటరీ దుర్గా ప్రసాద్, విజ్ఞాన జ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ చైర్మన్ హరిశ్చంద్ర ప్రసాద్, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వృత్తివిద్యా కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ క్యాంపస్‌లోని దుర్గాభాయ్ దేశ్‌ముఖ్ మహిళా సభ (డీడీఎంఎస్) కాలేజీలో వివిధ వృత్తి కోర్సుల్లో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నారు. పదవ తరగతి అర్హతతో ఫార్మసీ అసిస్టెంట్, హెల్త్‌కేర్ మల్టీపర్పస్ వర్కర్ (నర్స్ కోర్సు), ఆపరేషన్ థియేటర్ టెక్నీషియన్, డయాలసిస్ అసిస్టెంట్, ప్రీ ప్రైమరీ టీచర్ ట్రైనింగ్ కోర్సులలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవచ్చు. ఇంటర్ విద్యార్హతతో రెస్పిరేటరీ థెరపీ, ఈసీజీ, మెడికల్ ల్యాబ్, కార్డియాలజీ, పర్‌ఫ్యూజన్ టెక్నీషియన్లు, రేడియోగ్రఫీ అసిస్టెంట్, క్యాథ్ ల్యాబ్, పారా మెడికల్ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 30 వరకు దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. పూర్తి వివరాలకు 8309037134, 6305895867 నెంబర్లకు ఫోన్ చేసి తెలుసుకోవచ్చు.

అనారోగ్య సమస్యలతో గృహిణి ఆత్మహత్య

కుత్బుల్లాపూర్: అనారోగ్య సమస్యలతో ఓ మహిళ ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జీడిమెట్ల స్ప్రింగ్‌ఫీల్డ్ కాలనీకి చెందిన లక్ష్మయ్య, పార్వతి(39) భార్యాభర్తలు. వీరికి పదేళ్ల క్రితం వివాహం జరిగింది. పిల్లలు కాకపోవడంతో పార్వతి మెడిసిన్ వాడటంతో సైడ్ ఎఫెక్ట్‌తో వెన్నోకోస్, బోన్ వీక్‌నెస్‌తో బాధపడుతూ వస్తోంది. 3 సంవత్సరాల క్రితం బట్టలు ఉతుకుతుండగా జారీ పడటంతో కాలు విరిగింది. దీనికి తోడు భర్తకు గుండె సమస్య తలెత్తడంతో మానసికంగా కృంగిపోయింది. ఈ నెల 22న భర్త పని నిమిత్తం, కుమార్తె వాత్సల్య స్కూల్‌కు వెళ్లింది. ఈ క్రమంలో ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు చున్నీతో ఉరి వేసుకుంది. సాయంత్రం స్కూల్ నుంచి ఇంటికి వచ్చిన కుమార్తె తలుపు తట్టినా తీయలేదు. దీంతో సమీపంలో ఉన్న ఆమె బంధువు చంద్రశేఖర్, చుట్టు పక్కల వాళ్ల సహాయంతో తలుపులు పగలగొట్టి చూడగా.. పార్వతి ఫ్యాన్‌కు వేలాడుతూ కనిపించింది. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ఘనంగా అయ్యప్ప మహా పడిపూజ



పూజలో పాల్గొన్న అయ్యప్ప స్వాములు

నిజాంపేట్: నిజాంపేట్ గ్రామానికి చెందిన ఏనుగుల మాధవరెడ్డి నివాసంలో శనివారం అయ్యప్ప మహా పడిపూజను ఘనంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో అయ్యప్ప మాలాధారులు హాజరై స్వామివారి భక్తి గీతాలు ఆలపించారు. స్వాములకు, భక్తులకు భిక్ష ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో శ్రీకాంత్ రెడ్డి, శ్రీనివాస రెడ్డి, అభిషేక్ రెడ్డి, అయ్యప్ప ఆలయ చైర్మన్ కొలను చంద్రశేఖర్ రెడ్డి, రామాలయం చైర్మన్ కొలను శ్రీనివాసరెడ్డి, అభయాంజనేయ ఆలయ చైర్మన్ ధనరాజ్ యాదవ్ పాల్గొన్నారు.

పార్కు స్థలంలోని నిర్మాణం కూల్చివేత



సుభాష్‌నగర్: సుభాష్ నగర్ డివిజన్ సూరారంలోని సిద్ధి వినాయక నగర్‌లో స్థానికంగా ఉన్న పార్కులోని నిర్మాణాన్ని కూల్చివేయాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో శనివారం జీహెచ్ఎంసీ అధికారులు పోలీసు భద్రత మధ్య సదరు నిర్మాణాన్ని కూల్చివేశారు. సాయంత్రం ఈ విషయమై కాలనీకి చెందిన ఇద్దరు వ్యక్తులపై కొంతమంది దాడి చేశారు. దీంతో సిద్ధివినాయక నగర్ చెందిన కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు జితేంద్ర, విజేంద్ర తమపై దుర్భాషలాడుతూ దాడికి దిగారని వారిపై సూరారం పోలీసులకు ఫిర్యాదు చేశారు.

చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలి



కార్మికుల హాజరు నమోదును పరిశీలిస్తున్న ఏఎంహెచ్ఓ కవిత

కుత్బుల్లాపూర్: చెత్తను ఎప్పటికప్పుడు తరలించాలని, విధి నిర్వహణలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని కుత్బుల్లాపూర్ సర్కిల్ ఏఎంహెచ్ఓ కవిత అన్నారు. శనివారం ఉదయం కుత్బుల్లాపూర్ సర్కిల్ పరిధిలోని జీడిమెట్ల, కుత్బుల్లాపూర్, రంగారెడ్డినగర్, సుభాష్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలను ఆమె తనిఖీ చేశారు. కార్మికుల హాజరు నమోదు, రోడ్లపై చెత్తాచెదారాల తొలగింపు తదితర అంశాలను దగ్గరుండి పరిశీలించారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో రోడ్లపై చెత్తాచెదారాలను తరలించి ప్రజలకు అసౌకర్యం కలుగకుండా పని చేయాలని సిబ్బందికి సూచించారు. విధుల విషయంలో అజాగ్రత్తగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఎంఎల్ఆర్ఐటీలో విజయవంతంగా యూఎన్ఓ సెషన్స్ డే



కార్యక్రమంలో పాల్గొన్న వివిధ కళాశాలల విద్యార్థులు

దుండిగల్: దుండిగల్‌లోని మర్రి లక్ష్మణ్‌రెడ్డి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ (ఎంఎల్ఆర్ఐటీ) కళాశాలలో శనివారం మోడల్ యునైటెడ్ నేషన్స్ ఈవెంట్ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వివిధ కళాశాలలకు చెందిన 150 మంది విద్యార్థులు పాల్గొని యూఎన్ఓ తరహాలో చర్చలు నిర్వహించడం ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీనివాస్‌రావు, డీన్ డాక్టర్ రాధికదేవి, కళాశాల వ్యవస్థాపక కార్యదర్శి, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి తమ ప్రసంగాల ద్వారా విద్యార్థులకు స్ఫూర్తి నింపారు. ఈ యూఎన్ఓ ఈవెంట్‌లో ప్రపంచ సవాళ్లను ఎదుర్కోవడంలో యువత పాత్రపై ప్రభావంతమైన సంభాషణలతో విద్యార్థులు ఆకట్టుకున్నారు. సభ్య దేశాల ప్రతినిధులు సమన్వయంతో వ్యవహరిస్తూ ప్రపంచ సవాళ్లను ఎలా ఎదుర్కోవాలి, చర్చల్లో తీసుకున్న నిర్ణయాలను అమలు పరచడం వంటివి ఈ యూఎన్ఓ వేదికగా కళ్లకు కట్టినట్లు చూపించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డి, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో 2కే రన్



2కే రన్‌లో పాల్గొన్న యువత

సుభాష్‌నగర్: కొంపల్లి మున్సిపాలిటీ పరిధి దూలపల్లిలో వీహెచ్‌పీ, బజరంగ్‌దళ్ ఆధ్వర్యంలో నో డ్రగ్స్‌పై 2కే రన్‌ను శనివారం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా భాగ్యనగర్ క్షేత్ర సంఘటన మంత్రి గుమ్మళ్ల సత్యం, ఎంఎల్ఆర్ గ్రూప్స్ చైర్మన్ మర్రి లక్ష్మారెడ్డి, భాగ్యనగర్ క్షేత్ర బజరంగ్ దళ్ సంయోజక్ వీర్‌కుమార్ స్వామి పాల్గొన్నారు. జెండా ఊపి రన్‌ను ప్రారంభించారు. దూలపల్లిలోని శ్రీవేంకటేశ్వర ఆలయం నుంచి కొంపల్లిలోని ఏ.ఎం.ఆర్ గార్డెన్ వరకు రన్ కొనసాగింది.

వినూత్న ఆలోచనలతో జ్ఞానాన్ని పెంపొందించుకోవాలి

కేపీహెచ్‌బీకాలనీ: వినూత్న ఆలోచనలతో విద్యార్థులు విజ్ఞానాన్ని పెంపొందించుకోవాలని విశ్వ విద్యాలయ రెక్టార్, ప్రొఫెసర్ విజయ్‌కుమార్ రెడ్డి, రిజిస్ట్రార్ వెంకటేశ్వరరావు అన్నారు. జేఎన్‌టీయూహెచ్ కాలేజ్ ఆఫ్ ఇంజినీరింగ్, సైన్స్ అండ్ టెక్నాలజీలో శనివారం నూతన విద్యార్థులకు స్వాగత కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉజ్వల భవిష్యత్ కోసం సరైన మార్గంలో నడవాలని సూచించారు. స్వాగత కార్యక్రమంలో వినూత్నమైన టీజర్ల ప్రదర్శన ద్వారా అనేక ఆవిష్కరణలను పరిచయం చేయటం చూసి గర్వపడుతున్నామన్నారు. విద్యార్థుల విజయాలు విశ్వ విద్యాలయం, రాష్ట్ర అభివృద్ధికి దోహదపడాలని ఆకాంక్షించారు. సమాజంలో పాతుకుపోయిన సమస్యలకు పరిష్కార మార్గాలను చూపేలా నూతన ఆవిష్కరణలు చేపట్టాలని సూచించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ జి.వి. నరసింహారెడ్డి మాట్లాడుతూ.. విద్యార్థులు క్రమశిక్షణ, స్నేహభావంతో ఉండాలన్నారు. విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో సీఆర్‌సీ చైర్మన్ పార్వతి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

35 కిలోల అల్లం, వెల్లుల్లి పేస్ట్ స్వాధీనం

కేపీహెచ్‌బీకాలనీ: సిద్ధి వినాయక జనరల్ స్టోర్‌పై ఆకస్మిక దాడి చేసి 35 కిలోల నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను శనివారం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ కాలనీ మార్కెట్ రోడ్డులోని సిద్ధి వినాయక జనరల్ స్టోర్‌లో గడువు ముగిసిన నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్ట్‌ను విక్రయిస్తూ కొనుగోలుదారులను మోసం చేస్తున్నారని అదే ప్రాంతానికి చెందిన ఓ వ్యక్తి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. దీంతో ఎస్ఐ సుమన్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది సిద్ధి వినాయక జనరల్ స్టోర్‌పై దాడి చేశారు. షాపు యజమాని ఓం ప్రకాష్‌ను పోలీసులు ప్రశ్నించగా.. గడిచిన ఆరు సంవత్సరాల కిందట దీపక్ అనే వ్యక్తి పరిచయమై..తక్కువ ధరకు అల్లం, వెల్లుల్లి పేస్ట్ తయారు చేసి సప్‌లై చేస్తున్నాడని, వాటిని కొని ఎక్కువ ధరలకు విక్రయిస్తున్నట్లు అంగీకరించాడు. దీంతో అతని వద్ద నుంచి వివిధ పేర్లతో ఉన్న ఐదు కేజీల డబ్బాల నుంచి 200 గ్రాముల డబ్బాల వరకు ఉన్న 35 కిలోల నకిలీ అల్లం, వెల్లుల్లి పేస్టును పోలీసులు స్వాధీనం చేసుకుని మూసాపేట సర్కిల్ ఫుడ్ సేఫ్టీ అధికారులకు అప్పగించారు.



గుర్తు తెలియని మృతదేహం లభ్యం



కుత్బుల్లాపూర్: గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైన ఘటన పేట్‌బషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం.. దూలపల్లిలోని శ్రీవాణి స్కూల్ కల్వర్ట్ పక్కన ఓ గుర్తు తెలియని వ్యక్తి చనిపోయి ఉన్నాడని స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వెంటనే చేరుకున్న పోలీసులు శవ పంచనామా నిర్వహించారు. మృతుడి వయస్సు 35 నుంచి 40 మధ్య ఉంటుందని, ఒంటిపై మెరుపు రంగు టీ షర్టు, గోధుమ రంగు ప్యాంట్ ధరించాడని తెలిపారు. మృతుడి ఛాతిపై శిరీష, చేతిపై అమ్మ, నాన్న అని పచ్చబొట్టు ఉందని పోలీసులు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. మృతుడికి సంబంధించిన వివరాలు తెలిస్తే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.